క్లుప్తంగా

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థినులకు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతిని ప్రథమ సంవత్సరం విద్యార్థిని స్వప్న, ద్వితీయ బహుమతిని ద్వితీయ సంవత్సరం విద్యార్థిని గీతాంజలి, తృతీయ స్థానంలో యాస్మిన్ నిలిచారు. విజేతలకు కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి అందజేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి

నంద్యాల(అర్బన్): ఎంఎల్‌ఎస్ గోడౌన్‌లో రేషన్ బియ్యం లోడింగ్, అన్ లోడింగ్ చేస్తున్న హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ కార్యదర్శి గోపాల్ కోరారు. కూలి రేట్లు, ఈఎస్‌ఐ అమలు, దసరా బోనస్ చెల్లించాలని బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. లక్ష్మణ్ మాట్లాడుతూ హమాలీల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

శ్మశానాల ఏర్పాటుకు చర్యలపై హర్షం

నంద్యాల(రూరల్): రాష్ట్రంలో దళితుల శ్మశానాల ఏర్పాటుకు ప్రభుత్వం జీఓ విడుదల చేయడం హర్షనీయమని మాలమహానాడు ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బెల్లం రాజకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్మశానాలు లేని గ్రామాల ప్రజలు తమ కార్యాలయంలో సంప్రదించాలని ప్రకటించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అన్నపురెడ్డి దేవదాసు, తాలుకా అధ్యక్షుడు ఓబులేసు, మండల అధ్యక్షుడు జయన్న, గోస్పాడు మండల అధ్యక్షుడు డమాల నరసింహ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

గోస్పాడు: అంతర్జాతీయ స్థాయిలో దేశభక్తికి సంబంధించిన కవితల పోటీల్లో స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థిని అఖిల ద్వితీయ స్థానం సాధించిందని ప్రిన్సిపాల్ ఖాజా హుసేన్ తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులకు ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో దేశభక్తి కవితల పోటీలను గత ఏడాది జూలైలో ఆన్‌లైన్‌లో నిర్వహించారని చెప్పారు. ఇందులో అఖిల స్వాతంత్ర్యం- సమరయోధులు అనే కవితను రాయగా ద్వితీయ స్థానంలో నిలవడంతో పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ రూ.3వేల నగదు, ప్రశంసా పత్రం అందజేశారని వివరించారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

కూలీల సంఖ్య పెంచండి

ఉయ్యాలవాడ : మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ కూలీల సంఖ్య పెంచేందుకు గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పించాలని ఏపీఓ రవిప్రకాష్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎఫ్ఏలు, టీఏలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలంలో జరిగే పనుల్లో రోజుకు 2,800 మంది కూలీలు పాల్గొనేలా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందన్నారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు క్షేత్ర స్థాయిలో సమష్టిగా పనిచేసి కూలీలకు పనులు కల్పించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలాగే జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఆధార్ అనుసంధానం చేసుకోవాలని, ఇందుకు సిబ్బంది చొరవ చూపాలని చెప్పారు.

వడ్డె ఓబన్న జిల్లాగా మార్చాలి

నంద్యాల(అర్బన్): స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కుడి భుజం వడ్డె ఓబన్న పేరును నంద్యాల జిల్లాకు పెట్టాలని వడ్డె ఓబన్న సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శివశంకర్ కోరారు. వడ్డె ఓబన్న జయంతిని పురస్కరించుకుని స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమితి సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్రవ్యాప్తంగా జరుపుకునేలా ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. ఆసుపత్రి సూపరింటిండెంట్ ప్రసాదరావు, గోగుల చక్రధర్, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, నాగేంద్ర, మధు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగికి తాకీదు

నంద్యాల(సిటీ): స్థానిక 43వ సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ అడ్మిన్ సెక్రటరీ కే.వీ సుధాకర్‌కు బుధవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి నోటీసు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 7గంటల తర్వాత మున్సిపల్ కార్యాలయంలో సీ4 క్లర్క్ (జూనియర్ అసిస్టెంట్)గా విధులు నిర్వర్తిస్తున్న రేణుకాదేవి అనే ఉద్యోగిని పట్ల దురుసుగా ప్రవర్తించడంపై సోషల్ మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా తాకీదులు జారీ చేసినట్లు తెలిసింది. నోటీసు అందిన 24 గంటలలోపు వివరణ ఇవ్వకపోతే సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలు తప్పవని పేర్కొన్నారు.

నూతన హంగులతో నిర్మించిన మరుగుదొడ్లు



నూతన హంగులతో..

దొర్నిపాడు: స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో నిర్మించిన మరుగుదొడ్లు విద్యార్థుల అగచాట్లను తీరుస్తున్నాయి. స్వచ్ఛభారత్ నిధులతో 16 మరుగుదొడ్లను నిర్మించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వసతి గృహంలో గతంలో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్యకు సరిపడక పొలాలు, ఆరుబయట స్థలాల్లోకి వెళ్లాల్సి వచ్చేది. దీంతో వారు ఇబ్బందులు పడేవారు. ఇటీవల నూతనంగా నిర్మించి మరుగుదొడ్లలో నీటి సౌకర్యం, ప్రతి నాలుగింటికి రెండు వాష్‌బేసిన్‌లు ఏర్పాటు చేశారు. హాస్టల్‌కు వచ్చిన తల్లిదండ్రులు మరుగుదొడ్లను చూసి అవస్థలు తొలిగాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆకాంక్షలు నెరవేర్చాలి..



మాట్లాడుతున్న కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి

శిరివెళ్ల: క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తేవాలని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో ఫ్రెషర్స్‌డే జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థుల కోసం జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు చేశారన్నారు. కొత్త, పాత విద్యార్థులు కలిసిమెలిసి చదువుకోవాలని, ర్యాగింగ్‌ను దరి చేరనివ్వొద్దని సూచించారు. పీజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఆళ్లగడ్డ, నంద్యాల డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు శివారెడ్డి, శశికళ, కమిటీ మెంబర్ రాధాకృష్ణమూర్తి, సర్పంచ్ సుభాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దొర్నిపాడులో మిర్చి దిగుబడిని ఆరబోసిన దృశ్యం



ఆశల పంట..

దొర్నిపాడు: ఎర్ర బంగారంగా పిలుచుకునే మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రైతులు 1,068 హెక్టార్లలో పంట సాగు చేశారు. ఎండు మిర్చి ప్రస్తుతం కిలో రూ.250 నుంచి రూ.300 వరకు ఉంది. ప్రస్తుతం కోతలు జోరుగా సాగుతుండంతో బయలు ప్రదేశాల్లో పంటను ఆరబెట్టుకుంటున్నారు. తొలికోతలోనే ఆశించిన మేర దిగుబడి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు 20 క్వింటాళ్లకు పైగా వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పాలనకు అపూర్వ ఆదరణ



సంక్షేమ పథకాలను చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే గంగుల



మృతుడి తల్లిదండ్రులకు రూ.2లక్షల చెక్కు అందజేస్తున్న దృశ్యం

రుద్రవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ప్రజల నుంచి సంతోషం వ్యక్తమవుతోందని, గడప గడపకు వెళ్లినప్పుడు వారి నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని, లబ్ధిదారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వర్తించిన పథకాలు, చేకూరిన లబ్ధిని ఆనందంగా తెలియజేయడం, ఘనంగా స్వాగతం పలుకుతుండటం చూస్తుంటే జగనన్న పాలన పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారో అర్థమవుతోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం రుద్రవరంతో పాటు తువ్వపల్లె, రెడ్డిపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి మూడున్నరేళ్లలో అందిన పథకాల గురించి వివరించారు. అలాగే వారి సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే కార్యక్రమం ప్రారంభించారన్నారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు వారి దృష్టిని మళ్లించేందుకు ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని, ప్రజలు గమనించాలన్నారు. గతంలో పథకాలు వర్తించాలంటే అదో ప్రహసనంగా మార్చేశారని, ప్రస్తుతం కేవలం అర్హత ఉంటే చాలు అందజేస్తామని జగనన్న అమలు చేసి చూపుతున్నారని చెప్పారు. ప్రజారంజక పాలన కొనసాగాలంటే జగనన్నపై మీ ఆశీస్సులు కొనసాగించాలని కోరారు. ఇటీవల సురేష్ అనే వ్యక్తి తెలుగుగంగ కాల్వలో పడి మృతి చెందడంతో అందుకు ఆర్థిక సాయంగా రూ.2లక్షల చెక్కును మృతుడి తల్లికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పుట్లాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నాగేశ్వరరెడ్డి, నాయకులు గంగిశెట్టి తిమ్మయ్య, కొల్లం పుల్లయ్య, దేవగుడి జాకిర్, భైరీ శంకర్, ఏరువ కృష్ణమూర్తి, ప్రసాద్‌రెడ్డి, చంద్ర, మహేష్, బాలీశ్వరరెడ్డి, హరినారాయణ, రామిరెడ్డి, గోపాల్ రెడ్డి, లింగం బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నిర్మాణాలు చేపట్టకపోతే ఇళ్లు రద్దు



ఉయ్యాలవాడ జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ, అధికారులు

ఉయ్యాలవాడ : నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద మంజూరైన గృహ నిర్మాణాలు చేపట్టకపోతే పట్టాలు, ఇళ్లు రద్దు చేసి గృహాలు నిర్మించుకునే వారికి కేటాయిస్తామని తహసీల్దార్ రవికుమార్, హౌసింగ్ డీఈ నాగరాజు హెచ్చరించారు. బుధవారం స్థానిక జగనన్న లేఅవుట్ కాలనీలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన 145 మందిని అర్హులుగా గుర్తించి ప్రభుత్వ స్థలం లేకపోవడంతో రైతుల భూమిని కొనుగోలు చేసి పట్టాలు మంజూరు చేసిందన్నారు. రెండో విడతగా జగనన్న లేఅవుట్ కాలనీలో గృహాలు నిర్మాణాలు చేపట్టేందుకు ఉయ్యాలవాడకు 120, సర్వాయిపల్లె 58, ఆర్.పాంపల్లె 46, ఇంజేడు 54 మందికి గృహాలు మంజూరు చేసిందన్నారు. నెల రోజుల్లో నిర్మాణాలు చేపట్టకపోతే రద్దు చేయడంతో పాటు, ఇంటి పట్టాలు స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ నిరుపేదలు గృహాలు నిర్మించుకోవాలనే సదుద్దేశంతో రైతులను ఒప్పించి ఇళ్ల స్థలాల కోసం భూములు కొనుగోలు చేశామని, అయినా లబ్ధిదారులు నిర్మాణానికి పూనుకోకపోవడం సరికాదన్నారు. జగనన్న కాలనీలో వసతులు కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్ కృష్ణ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ షాదిక్ బాషా, వీఆర్‌ఓ రవిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహీం, ఏపీఎం శేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో వ్యక్తి అరెస్టు

నంద్యాల(వ్యవసాయం): కిడ్నాప్ కేసులో మహానంది మండలానికి చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ అర్పన నిందితుడిని రిమాండ్‌కు ఆదేశించినట్లు కోర్టు అధికారులు బుధవారం తెలిపారు. వివరాలు.. మహానంది మండలం సీతారామాపురం గ్రామానికి చెందిన జయనాధపురెడ్డి తండ్రి జమాల్ రెడ్డిని శ్రీనివాసరెడ్డి, అతని అనుచరులు కిడ్నాప్ చేసి దౌర్జన్యం చేసినట్లు మహానంది పోలీసు స్టేషన్‌లో 10వ తేదీన ఫిర్యాదు నమోదైంది. పోలీసులు శ్రీనివాసరెడ్డిని బుధవారం అరెస్టు చేసి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా 14రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ బుధవారం తెలిపారు. గ్రామ శివారులోని ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా జయరాముడు, మల్లికార్జున, నాగేశం అనే ముగ్గిరిని అరెస్టు వారి నుంచి రూ.5వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రైతు ఆత్మహత్యలపై ఆర్డీఓ విచారణ

శిరివెళ్ల: మండల కేంద్రం, కోటపాడులో గతేడాది నవంబరులో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను బుధవారం రాత్రి ఆర్డీఓ శ్రీనివాసులు విచారణ చేసి వివరాలు సేకరించారు. శిరివెళ్లకు చెందిన ఆదాము, కోటపాడుకు చెందిన కౌలు రైతు పెద్ద గోకారి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తహసీల్దారు షేక్ మొహిద్దీన్ ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా ఆర్డీఓ బాధిత కుటుంబాలను విచారించి అప్పుల వివరాలు, ఆత్మహత్యలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఏఓ సుధాకర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయానికి వచ్చే వారికి సహకరించేందుకు కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి బుధవారం తెలిపారు. ఈ హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజలు సమాచారాన్ని పొందవచ్చన్నారు. అయితే కార్యాలయానికి వచ్చే వారు ఇక్కడ తమ వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు.

సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషం




24వ వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి



ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలికిన నాయకులు, ప్రజలు

నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 24వ వార్డు పక్కీరపేటలో కౌన్సిలర్ షెహనాజ్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం మూడున్నరేళ్లలో అందజేసిన సంక్షేమ పథకాలు, పొందిన లబ్ధిని వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అవ్వా తాతలకు ప్రతి నెలా అందించే పింఛన్ నగదును రూ.2,500 నుంచి రూ.2,750 పెంచి ఈ నెల అందజేశారని చెప్పారు. గతంలో పింఛన్ పొందాలంటే ఎన్నో అవస్థలు పడాల్సి వచ్చేదని, నేడు ప్రతి నెల 1వ తేదీ తెల్ల వారుజామునే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందజేస్తుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారన్నారు. మరింత మెరుగైన పాలన, పథకాల అమలు తీరు, ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అర్హులకు మాత్రమే పథకాలు అందజేసిన ఘనత జగనన్నకే దక్కిందని, గతంలో ఒక ఇంటికి ఇన్ని రకాల పథకాలు అందిన దాఖలాలు లేవని, టీడీపీ పాలన, ప్రస్తుత పాలనకు తేడా గమనించాలన్నారు. పథకాలు కొనసాగాలంటే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, పథకాలతో సీఎం వైఎస్ జగన్‌కు లభిస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలను ఆరోపణలు గుప్పించి బురదజల్లే రాజకీయాలకు తెరతీశారని, వారి మోసపూరిత మాటలను ప్రజలు నమ్మరాదని కోరారు. వారిని మరో మారు ఇంటికే పరిమితం చేసి ప్రజాపాలనను కొనసాగించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంషావలి, రాష్ట్ర డైరెక్టర్లు సునీతా అమృతరాజ్, చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ రహంతుల్లా, న్యాయవాది శ్రీనివాసులు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కూడార్రై వేడుకలు



స్వామి వారికి పాయసాన్ని నైవేద్యంగా నివేదిస్తున్న పండితులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారికి కూడార్రై (పాయసం) నైవేద్యాన్ని శాస్త్రోక్తంగా సమర్పించారు. స్వామి వారికి ఉదయాన్నే పంచామృతాభిషేకం నిర్వహించి స్వామివారిని ప్రత్యేక అలంకరించారు. వేద పండితులు శ్రీకాంత్ శర్మ, డాక్టర్ టివి హయగ్రీవాచారి మాట్లాడుతూ గోదాదేవి శ్రీరంగనాథుడితో తన వివాహం జరిగితే 108 గంగాళాలతో పాయసాన్ని నివేదిస్తానని అనుకుంది. తన కోరిక నెరవేరడంతో మొక్కు చెల్లింపులో భాగంగా గోదాదేవి స్వామి వారికి పాయసాన్ని నైవైద్యంగా సమర్పించిన తీరును వివరించారు. అనంతరం లక్ష సామూహిక తులసి పూజా కార్యక్రమాన్ని మహిళలు నిర్వహించారు. చివరగా మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీ విష్ణు సహస్ర నామ కమిటీ మండలి ఆధ్వర్యంలో స్వామివారికి 108 గిన్నెల పాయసం నైవేద్యంగా సమర్పించారు.

భక్తి శ్రద్ధలతో త్యాగరాజ స్వామి జయంతి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక బాల్కొండ హాల్‌లో వెలసిన శ్రీ త్యాగరాజస్వామి దేవస్థానంలో స్వామి వారి జయంతిని భక్తి శ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. ఉదయాన్నే మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారికి పంచరత్న సేవ జరిపించారు. అనంతరం స్థానిక మహిళా విద్వాంసులతో త్యాగరాజ స్వామి కీర్తనలు, సంగీత కచేరీ చేపట్టారు. సాయంత్రం టీటీడీ ఆస్థాన విద్వాంసులతో శాస్త్రీయ సంగీత కచేరి జరిగింది. రామాయణం శ్రీనివాసులు, సురేష్‌బాబు, మణికంఠ, నాగరాజు, బాలకొండా రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

తీరనున్న గదుల కొరత



యర్రగుంట్ల ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల



తుది దశకు చేరుకున్న అదనపు గదుల నిర్మాణ పనులు

శిరివెళ్ల: మన బడి – నాడు కార్యక్రమం కింద యర్రగుంట్ల ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల గదుల కొరత తీరనుంది. 1963లో ప్రారంభమైన ఉర్దూ ప్రాథమిక పాఠశాల నాటి నుంచి కేవలం రెండు గదుల్లో నిర్వహింపబడుతోంది. పాఠశాలలో 1-8 తరగతుల వరకు 109 మంది విద్యార్థులు చదువుతున్నారు. 8 తరగతులకు కనీసం 4 గదులు కూడా నిర్మాణాలు జరగలేదు. ఒక్కో గదిలో మూడు, నాలుగు తరగతులు నడుస్తున్నాయి. గత ప్రభుత్వం గదుల నిర్మాణాలు చేపట్టకపోవడంతో విద్యార్థులు, టీచర్లు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఒకే గదిలో 1, 2, 3, 8 తరగతులు, మరో గదిలో 6,7 తరగతులు, వరండాలో 5, 4 తరగతులు నిర్వహిస్తున్నారు. అదనపు గదులు కావాలని ఎన్నో ఏళ్లుగా విజ్ఞప్తులు చేసినా బుట్ట దాఖలే. గత ప్రభుత్వం 2017లో ప్రాథమిక పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా మార్పు చేసిందేగానీ గదుల మంజూరు మాత్రం మరిచిపోయింది. అదనంగా 6, 7, 8 తరగతులు వచ్చి చేరాయి. ఇన్ని ఇబ్బందుల మధ్య నడుస్తున్న ఈ పాఠశాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న నాడు-నేడు పథకం వరంగా మారింది. ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రూ.25 లక్షలు, ప్రాథమికోన్నత సెక్షన్‌కు రూ. 59 లక్షల నిధులు మంజూరు చేయడంతో దశ మారిపోయింది. 2019 లో గదుల నిర్మాణాలకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రానాథ్‌రెడ్డి భూమి పూజ చేశారు. గదుల నిర్మాణాలు 90 శాతం పూర్తయ్యాయి. వేసవి సెలవుల అనంతరం అదనపు గదులు అందుబాటులోకి రానున్నాయి. సమస్య తీరనుండడంతో తల్లిదండ్రులు, టీచర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుతో సీమ రైతులకు ఒరిగిందేమీలేదు

బొమ్మలసత్రం: శ్రీశైలం ప్రాజెక్ట్ వల్ల రాయలసీమ రైతులకు ఒరిగిందేమీ లేదని, అది కేవలం విద్యుత్ ఉత్పత్తికి తప్పితే రైతులకు ఉపయోగపడదని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నంద్యాల పట్టణంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి గత కొన్నేళ్లుగా 600 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తుందన్నారు. ఆ నీటిని నిల్వ చేస్తే ఈ ప్రాంతంలో తాగు, సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈనెల 28న తలపెట్టిన చలో సిద్దేశ్వరం కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి, కామిని వేణుగోపాల్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పేరా శ్రీధర్‌రెడ్డి, సీమ కృష్ణ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: దీర్ఘకాలిక వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి కాంతరావు నాయక్ తెలిపారు. మండలంలోని రాయపాడు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్థానికులకు వైద్యసేవలందించి, మందులు అందజేశామని చెప్పారు. 104 వైద్యాధికారి ఫర్హానా, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

రుద్రవరం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో బుధవారం ప్రిన్సిపాల్ నాగేశ్వరావు, కో ఆర్డినేటర్లు పీఆర్ చవాన్, విజయలక్ష్మి, అనురాధ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను బుధవారం నిర్వహించారు. బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంక్రాంతి అంటే అచ్చమైన పల్లె పండుగని, సంప్రదాయాలు, సంస్కృతులను తెలియజేసే గొప్ప పండుగని ప్రిన్సిపాల్ వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

పనులు కల్పించాలి

రుద్రవరం: మండలంలో జాబ్‌కార్డు కలిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ 200 మంది తగ్గకుండా పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

నంద్యాల(అర్బన్): బాల్య వివాహాలు నేరమని, వాటి ద్వారా అనర్థాలు జరుగుతాయని ఎస్‌బీ సీసీ జిల్లా కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో బాల్య వివాహాలను నిర్మూలిద్దాం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలతో మాతాశిశు మరణాలు సంభవిస్తాయని, పిల్లల్లో శారీరక వికలాంగత్వం చోటు చేసుకునే అవకాశముందన్నారు. బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వం అనేక చట్టాలు తెచ్చిందని, వాటిని అనుసరించి నడుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల నివారణకు కృషి చేస్తున్న విజయ్‌కుమార్‌ను సచివాలయ సిబ్బంది సత్కరించారు. సిబ్బంది శివ, రవి, తిరుపాలు పాల్గొన్నారు.

సేవలను వినియోగించుకోండి

దొర్నిపాడు: ఖాతాదారులు డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీ బ్యాంక్ మేనేజర్ సురేష్‌కుమార్ కోరారు. బుధవారం స్థానిక బ్యాంక్ ఆవరణలో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొబైల్, ఇంటర్‌నెట్ బ్యాంక్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, వినియోగించుకోవాలన్నారు. అలాగే రైతులు పంట రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వం అందించే రాయితీలను పొందాలని సూచించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తిరుపాల్ బుధవారం తెలిపారు. గోస్పాడు మండలం జిల్లెల గ్రామానికి చెందిన చిన్న నరసింహుడు అనే వ్యక్తి గ్రామంలో రేషన్ బియ్యం సేకరిస్తున్నాడనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేయగా 24 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.